
వ్యంగ్య రచన

# కోడి సామ్రాజ్యం



ఎమ్వీయల్

అది కోడి సామ్రాజ్యం.

పర రాజ్యానికి చెందిన ఇంకోడికి అక్కడ చోటు లేదు.

ఎంత ప్రయత్నించినా ఇంకోడికి అక్కడ చోటు దొరకదు.

ఆ రాజ్యంలో రకరకాల కోళ్ళు.

కాకా కోళ్ళు. భజన కోళ్ళు. దేవదూత కోళ్ళు. మంత్ర తంత్రాల కోళ్ళు

ఓహ్ కోళ్ళ కొల్లలు; కొల్లల కోళ్ళు.

కొన్ని వాటాకోళ్ళు, వాటి వా[illegible]కోటా దొరికేవరకూ తల విసురుతూ గింజుకుంటాయి. దొరికాక "తృప్తాస్మ" అనుకొంటాయి కొన్ని ప్రజాకోళ్ళు. పదిమందిని వెంటేసుకుని కొక్కొరోకోం గోలతో రాజ్యమంతా తిరుగుతుంటాయి.

# వి లు వ లు

ఏ కాంతులూ పడనిదే
వెలుగులేని కఠిన వజ్రం
మనిషి చేయి పడనిదే
చలించని యంత్రంలా
పరాన్న జీవి,
అయినా చిరంజీవి
దాని మెరుపులకు
మార్కెట్టుందిప్పుడు

మెత్తని కొవ్వొత్తి మాత్రం
స్వయంగా జ్వలిస్తుంది
రాత్రి కాలమంత సేపు
జీవిస్తుంది
మార్కెట్ లో
పది పైసలకు దొరుకుతుంది.

కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ

కోళ్ళన్నీ గూళ్ళలోనూ, ఇళ్ళలోనూ, వాకిళ్ళలోనూవుంటే ఆస్థాన కోడిమాత్రం ఇల్లెక్కి కూచుంటుంది. వాటా, ప్రజా, జరా, రుజాగ్రసకోళ్ళన్నిటినీ అనుకరిస్తూ అవన్నీ కలిసి యింటిపైకి పంపే తిండిని తినమరగటమే ఆస్థాన కోడి యిల్లెక్కి కూయటానికి కారణం.

ఆ రాజ్యంలో కోడి సంఘాలున్నాయి. కోడి సభలు జరుగుతాయి. వాటి అరుపుల, చరుపుల గలభాలో ఒకోడి మాట యింకోడికి వినబడదు. అయినా సభలు పొద్దస్తమానం జరుగుతూనే వుంటాయి, పడగకి కోడెత్తిన కలంకారీ కోళ్ళు ఆ సభలకి అధ్యక్షత వహిస్తాయి. అందులో మళ్ళా పుంజు సంఘాలు, పెట్ట సంఘాలు విడి విడిగా జరుగుతాయి. ఒక ముసలి పుంజు మాత్రం పుంజుసంఘాల సభలకి ఎప్పుడూ వెళ్ళదు. పిలిచినా పిలవకపోయినా. పెట్టినా పెట్టకపోయినాపెట్టసంఘాల పేరంటాలసభలకివెళ్ళి అధ్యక్షోపన్యాస విసర్జన చేస్తుంది, "పెట్టలంతా చూస్తున్నారు గదా-మీరు గుడ్లులు పెట్టటమే ధ్యేయంగా పెట్టుకోక మంచి చిత్రాల్ని గియ్యవాల! మంచి రచనల్ని చెయ్యవాల! మంచిబొమ్మల్ని చెక్కవాల" అంటూ గంభీరంగా ఆ పెట్టలమధ్య ఏ గుడ్డూ పెట్టని పెట్టలాటి ఆ పుంజు ఉపన్యసిస్తుంది.

ఆ సామ్రాజ్యంలో ఈ మధ్యనే ప్రపంచ తెలుగోళ్ళ మహాసభ జరిగింది. విన్న కోళ్ళు విన్నాయి, తిన్న కోళ్ళు తిన్నాయి. మనం కొక్కోరో అనాలి తప్ప కక్కురో అనీ. తుక్కురో అని అనకూడదనీ తెలియని కోళ్ళు సభల రభసలో కాళ్ళు విరగ్గొట్టుకున్నాయి. ద్వితీయ ప్రపంచ తెలుగోళ్ళ మహాసభ మళ్ళీ జరపాలని తీర్మానించి తిండి ఎక్కువవటం వల్ల కోళ్ళన్నీ మాగన్నుగా పడుకున్నాయి. మళ్ళా లేచినప్పుడు సభ పెడతాయి.

ఒకో కోడి భూపాలరాగంలో అండం నించి బ్రహ్మాండం దాకా అదిరిపోయే సంగీతం పాడగలదు.

ఒకో కోడి నడకే నాట్యం అని దేశ విదేశాల్లో కాలిడినచోటల్లా పేరు తెచ్చుకో గలదు.

ఇంకో కోడి కాలితో నేల కాన్వాసుగా వేలు కుంచెగా చిత్ర చిత్రాలు గియ్య గలదు.

ఇంకో కోడి

"కూయవేరు నన్ను కొక్కొరోయని
ఏను రెక్కలు విదిల్చి
చీకటి జలజల రాల్చి
తూరుపు వెలుగెత్తే ఎలుగెత్త
గలదాన - ఆస్థాన కోడి కాగలదాన"

అని కవిత చెబితే కోళ్ళు కోళ్ళన్నీ కంటతడిపెట్టి ఆనందాండాల్ని ప్రసవిస్తాయి.


కోళ్ళ రాజ్యంలో పూర్వం మహానాటకాలుండేవి. కోళ్ళ గూడు తెరపేసి చీకటి పడటంతో "పరాబ్రహ్మ" మొదలెడితే తెల్లారి తెర తీసి కొక్కొరోకో అనే వరకూ నాటకాలాడేవి. ఇప్పుడు కాస్త బద్ధకించి నాటికలే ఆడుతున్నాయి. దానికూ్కడా బద్ధకం వేసి ఏ పక్షిరాజమో రాసిన నాటికని తమ పేర ఖర్చు రాసేసుకుని ఎవరో కోడి "కొక్కొరోకో" అని డైలాగ్ చెబితే "లిప్ మూమెంట్" ఇస్తూ కాలక్షేపం చేసేస్తున్నాయి.

ఈ సాహిత్య. సంగీత, నాటక కోళ్ళ అకాడమీల సభ్యులు-సభ్యులు కాని వాళ్ళని రోజూ తాము తినే పురుగుల్లా చూస్తాయి. మెడ పైకెత్తి మౌనాన్ని. గాంభీర్యాన్ని గొంతుక్కి పూసుకుని కోడి కునుకుతో సర్వసభ్య సమావేశాలు ముగించి పరస్పరావగాహనతో ఏకగ్రీవంగా కొక్కొరోకోఅని అరిచి అన్ని విషయాలకీ అంగీకారాన్ని తెలియజేసేస్తాయి. లేస్తే మనిషి కానన్నట్టు రాస్తే నన్నెవ్వరాపలేరీవేళ అని వొంటికి వున్న "ఈకలాలు" విదిలించి బెదిరిస్తాయి. సర్వసభ్య సమావేశాలకు వెళ్ళిన మేత ఖర్చులు పుచ్చుకుని గూళ్ళకి చేరుకుంటాయి.

ఆ రాజ్యంలో కోడియో లున్నాయి. అందులో వార్తలు కొక్కిరించినట్లు ముద్దగా నత్తిగా "మాత్తాలే వాల్లందలూ" రకరకాల ఫోగ్రాములిస్తారు. నిలవకోళ్ళు నిత్యం వాద్యఘోష పెడతాయి. ఉగాదికి జెండా పండక్కి, రాజకోడి రెండేళ్ళ దిగ్విజయ పాలనకీ కోడి సమ్మేళనాలు ఖాద్యఘోషతో, బాజా భజంత్రీలతో జరుగుతాయి.

కోడియోలో సంస్కృత భాషలో కూడా కొక్కొరోకోటి వార్తలొస్తాయి. ఒకప్పటి దేవకోళ్ళ భాష పునరుద్ధరించటానికే ఆ భాషలో వార్తలు వస్తాయన్నమాట. ఆ భాషలో నాటకాలు, పద్యాలూ వున్నా-ముక్కున పటలేక వాటిజోలికి మాత్రం పోవు.

ఇలా ప్రశాంతంగా కోడి సామ్రాజ్యం మూడుకోళ్ళు ఆరుగుడ్లుగా వర్ధిల్లుతుండగా-కొన్ని యువ కోళ్ళు మోరవిరిచాయి,



కొన్ని పిర కోళ్ళు తొడ చరిచాయి. కొన్ని కాటాకోళ్ళు కాలు దువ్వాయి.

వయసు చెల్లిన కోళ్ళన్నీ జార చోర నీచ కోళ్ళని యువకోళ్ళు ప్రాపగాండా మొదలుపెట్టాయి. జాతికి పట్టిన పీడ వదిలించి కోళ్ళలో కొత్తనెత్తు రెక్కించా లనుకున్నాయి.

మహాకోడి, కోడి సమ్రాట్, కోడి సార్వభౌమ, గానకోడి, నటకోడి, విట కోడి మొదలైన బిరుదులకు వయసు చెల్లిన వాళ్లతోపాటే కాలం చెల్లిపోయాయన్నాయి. ఎవళ్ళకి వాళ్ళు కోళ్ళ గూళ్ళమీద కోడి సమ్రాట్ అని రాసేసుకున్నాయి. ఆ బిరుదు ఎవరూ యివ్వలేదు అని ఎగతాళీ చేశాయి.

"ఆమ్లెటా హాఫ్బాయిలా?
ఏది సత్యం ఏద సత్యం
ఏది కోడి ఏది గుడ్డు"

అని కొత్తరకం కవిత్వం కట్టాయి.

కోడొచ్చిన వేళ. కోడలొచ్చిన వేళా మంచిది. కోడెంచి మేలెంచమన్నారు— ఇలాటి సామెతలు చెడిపోయిన గుడ్లలాంటి వన్నాయి. ఆ పాతబూజు సామెతల్ని ఇంక కుయ్యక్కరలేదన్నాయి.

దినమొరిగి ఇల్లెక్కి కూసే ఆస్థాన కోడికి- తిండి ఇంటిపైకి పంపకుండా ఎండలో మాడ్చేసి, సరాసరి పైకే పంపిం చెయ్యాలన్నాయి.

నేను కోడినికాదు-తాడి తన్నగలవాడి తల తన్నగల క్రీడిని అన్నాయి వీరో చితంగా.

యువకోళ్ళ కేకలు, గోల వృద్ధ కోళ్ళకి నచ్చలేదు. జాతి పతనమై కోడి ప్రతిష్ఠ కత్తికి బలై పోతోందని బాధపడ్డాయి. జాలిపడ్డాయి, కోప్పడ్డాయి. గుడ్డొచ్చి కోడిని వెక్కిరించినట్లు ఏమిటీ ఈకల్లేని "బోడి" కేకలు అన్నాయి. "ఆ! పోదూ! గుడ్డుతో పోయేదానికి కత్తిదాకా ఎందుకు- పురిట్లోనే చిదిమేద్దాం" అన్నాయి కొన్ని జ్ఞాన కోళ్ళు. అలా చిదిమేస్తే కోడి జాతి ఉదాహరణకి కూడా మిగలదుకదా : అన్నాయి కొన్ని అజ్ఞాన కోళ్ళు.

యువకోళ్ళు ఇవన్నీ వినబడినా గోళ్ల గిల్లుకుంటూ కూ చో లే దు. కోడిగుడ్డుకి ఈకలుపీకటం అనవసరం అనుకున్నాయి.

యువ కోళ్ళన్నీ కలిశాయి.
గూళ్ళు వదిలాయి
యిళ్ళు వదిలాయి
వాకిళ్ళు వదిలాయి.
ఊళ్ళు వదిలాయి.
ఏళ్ళూ పూళ్ళూ దాటాయి.

సజ్జలు తినటం అనవసరం అనుకున్నాయి.

చచ్చు తిండి తినటం అసహ్యించు కున్నాయి.

రాళ్ళు తిని అరిగించుకున్నాయి.

నోరు పట్టని రాళ్ళు తిని కూడా హరా యించుకోగలం అనుకున్నాయి.

కలిసికట్టుగా పుంజుకున్నాయి.
సద్యోయౌవనం వచ్చే గుడు పెట్టాయి.
కత్తి కట్టినటు జట్టుగా బయల్దేరాయి.
ఏళ్ళూ పూళ్ళు దాటి ఊళ్ళు, వాకిళ్ళు, యిళ్ళు. గూళ్ళు ఆక్రమించాయి.

సభలు చెదిరే పదును.
సంఘాలు బెదిరే పదును.
కోడియోలు పగిలే పదును
పీకలు తెగిపడే పదును.

ఇదే అదను కదం కథను
రచించెదను నేను.
ఇదే అదను కదం కథకు
వచించెదను నేడు !
హింస రచన
ధ్వంస నచణ
అది విలయం
ఇది సమరం!!

పీకలు తెగిన నెత్తురు ప్రపంచ తెలుగు కోళ్ళ మహాసభకి వెలిగించిన జ్యోతిలా మండింది.

భళ్ళున తెల్లారింది.

కళ్ళు తెరిచాను.

కలా! నిజమయ్యే కళ కాదన్నమాట! రాత్రి తిన్న "చికెన్" అరక్క వచ్చిన కలా! లేక చికెన్ లాటి చిన్నదాన్ని పగ లంతా కలవరించగా వచ్చిన కలా ?

అయినా తెల్లారగట వచ్చింది కదా నిజ మవకపోతుందా అన్న ఆశతో గబగబా మంచం మించిలేచి, కోళ్ళగూటి దగ్గర కెళ్ళి, కోళ్ళని నిద్రలేపి, కొక్కొరోకో అనిపించి, బ్రేక్ ఫాస్ట్ కి కావలసిన కోడి గుడ్లు జాగ్రత్తగా పెట్టి, రేడియో ఆన్ చేసి, సంస్కృత వార్తలు వస్తుండగా ప్రాతఃకాల కార్యక్రమాల ప్రారంభోత్సవానికి పరి గెత్తాను.

## చావు !

ఒక పత్రికకు ప్రకటన నిమిత్తం, ఒక గేయం వచ్చింది. "నే నింకా, ఎందుకు బ్రతికి వున్నాను?" అని దాని శీర్షిక. పత్రికాధిపతి దానిని త్రిప్పిపంపుతూ "టపాలో పంపించావు కనుక" అని జవాబు వ్రాశాడు.

## డాక్టర్ ప్రయోజనం

రామనాధం : డాక్టరుగారూ! మీ వైద్యం వల్ల నాకు చాలా ఉపకారం జరిగిందండీ!

డాక్టరు : నేను మీ కెప్పుడూ వైద్యం చేసిన జ్ఞాపకంలేదే?

రామ : నాకుకాదు, మాపినతండ్రికి చేశారు. నాకు లక్ష రూపాయల ఆస్తి వారసత్వం క్రింద సంక్రమించింది.

## మతిమరుపు

ఒక ప్రసిద్ధుడైన ఆక్సఫర్డు యూనివర్సిటీ ప్రొఫెసరు రైలులో ప్రయాణం చేస్తున్నాడు. టిక్కెట్టు కలెక్టరువచ్చి "టిక్కెట్టు" అడిగాడు. ప్రొఫెసరు ఆ జేబూ, ఈ జేబూ వెతుకుతూ కంగారుపడుతున్నాడు. టిక్కెట్టు కలెక్టరు "పర్వాలేదులెండి. నేను మిమ్మల్ని ఎరుగుదును మీరు టిక్కెట్టుకొనే వుంటారు" అన్నాడు ముందుకు నడుస్తూ. "అదిసరే బాబయ్యా! ఆ టిక్కెట్టు లేకపోతే నేనే స్టేషనులో దిగాలో ఎల్లా తెలిసేడుస్తుంది?" అన్నాడా ప్రొఫెసరు గాభరాపడుతూ.

—జె. రాఘవేంద్రరావు, గుడివాడ

